క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



ఎస్‌ఏ పేపర్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఐరాల: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని ఇరువారంపల్లె, కలికిరిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా గ్రూపులుగా విభజించి బోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం అమలు, విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఎస్‌ఏ–1 పరీక్ష పేపర్లను పరిశీలించారు. వర్క్‌బుక్స్‌ పెండింగ్‌ లేకుండా విద్యార్థులతో రాయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

125 మందికి వైద్య సేవలు

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి ప్రియాంక 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మిట్టపల్లెలో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్యం అందించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

తవణంపల్లె: మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్లో ఈనెల 5వ తేదీన చెవి, గొంతు, ముక్కు వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అరగొండ అపోలో ఆస్పత్రి ఏఈ చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. అపోలో మెడికల్‌ కాలేజీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఖలీల్‌ వైద్య సేవలు అందిస్తారని వివరించారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టూ టౌన్‌ సీఐగా మద్దయ్య ఆచారి



చిత్తూరు అర్బన్‌: చిత్తూరు టూటౌన్‌ సీఐగా మద్దయ్య ఆచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాలూక స్టేషన్‌లో పనిచేస్తున్న మద్దయ్యను టూటౌన్‌కు.. పుంగనూరులో పని చేస్తున్న గంగిరెడ్డిను తాలూక స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులివ్వడం విదితమే.

5న సిద్ధ యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్‌: నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో ఈ నెల 5 నుంచి 14 రోజుల పాటు సిద్ధ యోగా ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు యోగాచార్యులు నరేంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. 14 ఏళ్ల పైబడిన వారు ఈ తరగతులకు పాల్గొనవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 8247609140 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

సారా విక్రేత అరెస్ట్‌

చిత్తూరు అర్బన్‌: బంగారుపాళ్యం మండలంలో శుక్రవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. వెంకటాద్రి (62) అనే వ్యక్తి నుంచి మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్ట్‌ చేసి అతడిని రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్‌, ఎస్‌ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఆది దంపతులు



పలమనేరు: పట్టణంలోని శివాలయంలో జరుగుతున్న కాశీవిశ్వేశ్వరుని వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై నుంచి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయం వద్ద ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం గ్రామోత్సవం జరిగాయి. ఇందులో పలువురు భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో గిరిజాకల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

6న చేపల చెరువుల వేలం

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని చేపల చెరువులకు ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు వేలం నిర్వహించనున్నట్లు డీడీఓ కుమార్‌ తెలిపా రు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు డిపాజిట్‌ చేయాలని పేర్కొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మరకాలకుప్పం పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అవినీతి, మోసం, అబద్ధాలతో సాగిందని, ఇప్పుడు మళ్లీ తాను అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మేలు చేస్తానన్ని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీలు, విద్యుత్‌ స్తంభాలు, వేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌ జనార్దన్‌, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌ రెడ్డి, రజనీకాంత్‌, శింబు, సాయి ప్రతాప్‌, సాయి, రవి, శేఖర్‌, విక్టర్‌, సంపత్‌, తహసీల్దార్‌ బాబు రాజేంద్ర ప్రసాద్‌, ఎంపీడీఓ ఉపేంద్ర, ఏఈఈలు జయచంద్రారెడ్డి, హిమాంత్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సాయం



విభిన్న ప్రతిభావంతులకు స్కూటీలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్‌: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం తరపున రూ.6.60 లక్షలు విలువ చేసే 6 స్కూటీలను (త్రిచక్రవాహనాలను) అందజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల చేతుల మీదుగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వీటిని ఇచ్చారు. నియోజకవర్గానికి పదిస్కూటీలు మంజూరు చేశారని, తొలి విడతలో 6 వాహనాలను ఇచ్చామని, త్వరలో మిగిలిన వాహనాలను అందజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అందరితో సమానంగా విభిన్న ప్రతిభావంతులు ఉండాలని ప్రభుత్వం వీటిని అందజేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభా వంతుల శాఖ సిబ్బంది రాజశేఖర్‌, శ్రీధర్‌ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పక్కాగా ఫ్రైడే డ్రైడే



9వ వార్డులో డ్రై డే.. ఫ్రైడేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్‌: నగరపాలక సంస్థ పరిధిలో 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్‌ లోకేష్‌ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక పరిధిలో 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. 9వ వార్డులో నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ జి.ప్రకాశం, మలేరియా అధికారి శ్రీనివాసులు, డాక్టర్‌ లోకేష్‌ ప్రారంభించారు. ర్యాలీగా వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటా డ్రైడే పాటిస్తే రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. స్థానికంగా పలు గృహాల వద్ద పాత్రలో నిల్వ చేసే నీటిలో లార్వాలను, వాటి వల్ల వ్యాపించే రోగాల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, సబ్‌ యూనిట్‌ అధికారి పీరూ సాహెబ్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ కృష్ణారెడ్డి, నగరపాలక వార్డు కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైస్‌ ఎంపీపీగా ద్వారకనాథరెడ్డి



ద్వారకనాథరెడ్డికి ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి

పూతలపట్టు: మండల నూతన వైస్‌ ఎంపీపీ–1 గా ద్వారకనాథరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి జాన్‌ విక్టర్‌ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. వైస్‌ ఎంపీపీ సుబ్బారెడ్డి మృతితో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు అధికారులు నోటిఫికేషన్‌ ఇచ్చి ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులకు గానూ 8 మంది హాజరై ద్వారకనాథరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుమారి, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, మండల కన్వీనర్‌ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీఏ ఫౌండేషన్‌ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్‌ రమేష్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్‌: నగరంలో మిట్టూరులోని ఆర్‌కే జూనియర్‌ కళాశాల విద్యార్థులు సీఏ ఫౌండేషన్‌ ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్‌ బద్రినారాయణ, ప్రిన్సిపల్‌ రమేష్‌బాబు తెలిపారు. పూజ 271, జయదీప్‌ 249, లోకేష్‌ 235 మార్కులు సాధించి ప్రతిభ చాటారని, గత పదేళ్లుగా తమ కళాశాల విద్యార్థులు సీఏ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం ఆ విద్యార్థులను అభినందించారు.

కో–ఆప్షన్‌ మెంబర్‌ ఎన్నిక వాయిదా

చిత్తూరు రూరల్‌: చిత్తూరు మండల కో–ఆప్షన్‌ మెంబర్‌ ఎన్నిక వాయిదా పడింది. ఇటీవల కో–ఆప్షన్‌ మెంబర్‌ ఖలీల్‌ మృతి చెందారు. ఈ స్థానానికి ఎన్నిక నిర్వహిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే శుక్రవారం ఒక్క నామినేషన్‌ కూడా దాఖలు కాలేదు. దీంతో ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి చెప్పారు.

ఉపాధిలో తేలని లెక్క రూ.41 వేలు

- మస్టర్లను సక్రమంగా నిర్వహించని మేట్లే కారణం
- పలమనేరు ఏపీఓ పుష్పలత

పలమనేరు: పలమనేరు మండలానికి సంబంధించి గతేడాది చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో రూ.41 వేలు లెక్కతేలని అభియోగ రుసుముగా తేలిందని పలమనేరు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ఏపీఓ పుష్పలత తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె 16వ విడత సామాజిక తనిఖీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని పది పంచాయతీల్లో గతేడాది రూ.3.19 కోట్లతో ఫాంపాండ్‌, ఫిష్‌పాండ్‌, క్యాటిల్‌ పాండ్‌, మామిడి మొక్కల పెంపకం లాంటి పనులు జరిగాయన్నారు. ఇందుకు సంబంధించిన సోషల్‌ ఆడిట్‌ విచారణలో రూ.41 వేల దాకా లెక్కలు తేలలేదన్నారు. దీనిపై జిల్లా అధికారులు రికార్డులను తనిఖీ చేయగా పది పంచాయతీల్లోనూ మేట్‌లు మస్టర్లను సక్రకంగా నిర్వహించనందున తేడాలొచ్చినట్టు నిర్ధారించారన్నారు. ఇక అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి మొత్తం 3,341 మొక్కలను నాటగా వాటిల్లో 731 మొక్కలు చనిపోయినట్టు తేలిందన్నారు. వీటిని మళ్లీ నాటించనున్నట్టు తెలిపారు.

పాఠ్య పుస్తకాల్లో అంబేడ్కర్‌ చరిత్ర ప్లీజ్‌!

చిత్తూరు కలెక్టరేట్‌: అన్ని తరగతుల పాఠ్యాంశాల్లో అంబేడ్కర్‌ జీవిత చరిత్రను ముద్రించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆ సంఘ నాయకులు డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వచ్చే సంవత్సరం అంబేడ్కర్‌ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలల్లో ముద్రించకపోతే ఉద్యమిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



చెరకు పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని చిత్తూరు పీఎస్‌ఎఫ్‌ డీపీఎం(చిత్తూరు) వాసు తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్‌ గాలి మహేష్‌ బాబు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం, కషాయాలు వినియోగంతో చీడపీడల నివారణతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి సాగుతో పండించే చెరకు నుంచి తయారు చేసే బెల్లాన్ని తిరుమల–తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామని తెలిపారు. రైతులకు మార్కెట్‌ ధర కన్నా ఐదు శాతం ఎక్కువ రేటుకు టీటీడీ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి సాగులో ఉన్న చెరకు పంటను పరిశీలించారు.

కొడుకు హింసిస్తున్నాడని ..

పలమనేరు: ఆస్తి కోసం కొడుకు తరచూ హింసిస్తున్నాడని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పలమనేరు పట్టణంలో శుక్రవారం వెలుగు చూసింది. పట్టణంలోని ఎద్దుల సంతవీధిలో నివాసం ఉండే వహీదా(50ను కొడుకు లాయర్‌ షరీఫ్‌ ఆస్తి విషయంలో ఇబ్బంది పెడుతున్నాడని ఆమె వాపోయింది. దీంతోనే తాను చనిపోవాలని నిర్ణయించుకున్నానని, తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది. దీనిపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

కళాతపస్వికి నివాళి



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను చిత్ర పరిశ్రమ ద్వారా విశ్వవ్యాప్తం చేసిన కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు పట్టణ సమీపంలోని కళామందిరంలో శుక్రవారం నివాళులర్పించారు. తులసీనాథం నాయుడు, పుష్ప, నరేంద్ర, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి



కనికలమ్మ లేఔట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్‌ హరినారాయణన్‌

గంగాధరనెల్లూరు: భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌ హరినారాయణన్‌ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొండేపల్లి, వీరకనెల్లూరు, నెల్లేపల్లెకు సంబంధించిన భూ రికార్డులను తహశీల్దారు కార్యాలయంలో ఆయన పరిశీలించి తహశీల్దారు ఇన్బనాథన్‌కు పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో రైతులతో సమన్వయం చేసుకుని సర్వేయర్లు రీ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీకాలనీ వాసులకు శ్మశాన స్థలాల కేటాయింపునకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రెవెన్యూ అధికారులు దీనికి సంబంధించిన భూములను గుర్తించాలన్నారు. మండలంలో అసైన్డ్‌ భూముల పంపిణీకి 160 మంది లబ్ధిదారులకు 157 ఎకరాల భూములను గుర్తించినట్లు ఆర్డీఓ రేణుక కలెక్టర్‌కు వివరించారు. రామానాయుడుపల్లె, కనికలమ్మ జగనన్న లేఔట్‌ను పరిశీలించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని పెంచాలని కలెక్టర్‌ సూచించారు. జేసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీదేవి కూడా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

వడమాలపేట: అంబేడ్కర్‌ యువజన సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం వడమాలపేటలో సంఘం జిల్లా కార్యదర్శి మునిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లోకనాథం, అధ్యక్షుడిగా జయంత్‌, జనరల్‌ సెక్రటరీగా దేవరాజులు, కోశాధికారిగా గణేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..



దాసరాపల్లెలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు

యాదమరి: సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలను తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని దాసరాపల్లె సచివాలయ పరిధిలోని దాసరాపల్లె, దాసరాపల్లె దళితవాడ, దాసరాపల్లె ఆది ఆంధ్రవాడ, ఆరిమాకులపల్లె గ్రామాల్లో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ధనంజయరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌ ప్రసాద్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వలంటీర్లు, సచివాలయ అధికారులు, మీ సమస్యలను పరిష్కరిస్తున్నారా అని ఆరా తీశారు. దాసరాపల్లె గ్రామస్తులు మాట్లాడుతూ అటవీప్రాంతంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారని, అక్కడ ఇళ్లు నిర్మించుకోలేమని, గ్రామానికి ఆనుకుని ఉన్న దేవాలయ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ సురేష్‌ బాబు, తహసీల్దార్‌ చిట్టిబాబు, ఎంపీడీఓ శివరాజ్‌, నాయకులు మనోహర్‌ రెడ్డి, మనోహరన్‌, ఎల్‌ఐసీ గిరి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మసీదులో రాజకీయాలొద్దు

- జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్‌ చైర్మన్‌ గఫార్‌ఖాన్‌



మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్‌ బోర్డు వైస్‌ చైర్మన్‌ గఫార్‌ఖాన్‌

చిత్తూరు కార్పొరేషన్‌: యువగళం కార్యక్రమానికి ముస్లింలు రావాలని మసీదు కమిటీలను టీడీపీ నాయకులను కోరడం సరికాదని జిల్లా వక్ఫ్‌ బోర్డు వైస్‌ చైర్మన్‌ గఫార్‌ఖాన్‌ ఆక్షేపించారు. త్వరలో చిత్తూరులో నారాలోకేష్‌ యువగళం పాదయాత్ర జరుగుతుందని దానికిభారీ సంఖ్యలో ముస్లింలు హాజరుకావాలని.. శుక్రవారం నగరంలోని పలు మసీదు కమిటీ సభ్యులను టీడీపీ నాయకులు కోరారన్నారు. నమాజ్‌ సమయంలో యువగళంలో పాల్గొనాలని మసీదు కమిటీ సభ్యులు చెప్పాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. మసీదులో ఏ పార్టీ వారైనా దువా చేయవచ్చని, కానీ పార్టీ కార్యక్రమాలకు రావాలని రాజకీయం చేయడం క్షమార్హం కాదన్నారు. రాజకీయ ప్రచారాలు మసీదు బయట చేసుకోవాలని హితవు పలికారు. మైనార్టీల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.21 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ముస్లింలకు అందాల్సిన సంక్షేమం అందుతోందన్నారు. మతంలో చిచ్చు పెట్టడానికి టీడీపీ నాయకులు కుట్రచేస్తున్న విషయాన్ని మైనార్టీలు గుర్తించాలన్నారు. ఇలాంటి చర్యలు పునరావృత్తమయితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతామని హెచ్చరించారు.

ప్రజా మరుగుదొడ్ల తనిఖీ



పీసీఆర్‌ సర్కిల్‌ వద్ద మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కమిషనర్‌

చిత్తూరు అర్బన్‌: నగరంలోని ప్రజా మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్‌ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్‌ నగరంలోని పీసీఆర్‌ సర్కిల్‌ వద్ద ఉన్న ప్రజా మరుగుదొడ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్‌ ఎంఎస్‌ఆర్‌, దర్గా సర్కిల్‌, కాజూరు, ఇరువారం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, తేనెబండ హౌసింగ్‌ లేఅవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్‌, అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. మార్చి 15 కల్లా నిర్దేశిత లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ చిన్నయ్య, హౌసింగ్‌ ఏఈ శ్రీధర్‌, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పూతలపట్టు: జగన్నన కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. శుక్రవారం మండలంలోని పూతలపట్టు, వేనూతనపల్లె లేఅవుట్‌లలో పనులను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ చాలా మంది సగం పనులు చేసి ఆపేశారని, వారంతా పనులు పూర్తి చేయాలని తెలిపారు. పూర్తిచేయాలని కోరారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వేనూతనపల్లెలో కాలువ పనులను పరిశీలించారు. హౌసింగ్‌ అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు చేయాలి

ఐరాల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగంవాండ్లపల్లె పంచాయతీ, 35 యర్లంపల్లె పంచాయతీలోని జగనన్న కాలనీల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాది నాటికి ప్రభుత్వం గృహ ప్రవేశాలు చేయాలని నిశ్చయించినట్లు స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పనులను పూర్తి చేయాలన్నారు. పనులు ప్రారంభించకుంటే ఇంటి పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఏపీఓ సంధ్య, హౌసింగ్‌ అధికారులు పాల్గొన్నారు.

కావమ్మా కరుణించమ్మా!



ఆలయంలో భక్తులతో మంత్రి రోజా

పుత్తూరు రూరల్‌: పట్టణంలోని శ్రీకావమ్మా ఆలయ ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖా మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. కావమ్మ, మారయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కావమ్మా కరుణించమ్మా అంటూ ప్రార్థించారు. ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జయప్రకాష్‌, ఆలయ నిర్వాహకులు మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, కౌన్సిలర్‌ రాధ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీఓ సుజన

పాలసముద్రం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రీ సర్వే చేస్తున్నట్లు ఆర్డీఓ సుజన తెలిపారు. శుక్రవారం మండలంలో బాలకృష్ణాపురంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్షణ పథకం రీ సర్వేను ఆమె పరిశీలించారు. పారదర్శకంగా సర్వే చేయాలని సర్వేయర్లు, వీఆర్వోలకు సూచించారు. రైతులు భూ రికార్డులను అధికారులకు అందజేసి శాశ్వత సరిహద్దులు ఏర్పరుచుకోవాలని తెలిపారు. అనంతరం బాలకృష్ణాపురం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్‌ బాబు, మండల సర్వేయర్‌ కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.